సాక్షి
తూర్పుగోదావరి

గురువారం । 12 । జూన్ । 2025




గోదారి తీరాన నృత్యోత్సవం
నృత్య నీరాజనంతో గోదారితీరం పులకించనుంది. వంద మందికి పైగా నృత్య కళాకారులు ఒకే వేదికపై నాలుగు రోజులపాటు నగర ప్రజలను పరవశింపజేయనున్నారు.

8 లో



సత్యదేవుని సన్నిధికి సులువుగా!
రత్నగిరి సత్యదేవుని సత్యదేవుని దర్శనానికి మరో మార్గానికి పనులు చురుగ్గా సాగుతున్నా యి. మొదటి ఘాట్‌రోడ్డు వద్ద గల టోల్‌గేట్ నుంచి రెండో మెట్లదారి నిర్మిస్తున్న విషయం తెలిసిందే.

16,050 క్యూసెక్కులు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి బుధవారం 16,050 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. డెల్టా కాలువలకు 4,650 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద 10.25 అడుగుల నీటిమట్టం నెలకొంది.

న్యూస్‌రీల్

మధ్యాహ్న భోజనంలో సన్న బియ్యం
కంబాలచెరువు (రాజమహేంద్రవరం): నూతన విద్యా సంవత్సరంలో పాఠశాలలు ప్రారంభించిన రోజు నుంచే విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకానికి సన్న బియ్యాన్ని వినియోగిస్తామని జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కంది వాసుదేవరావు బుధవారం ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే అన్ని అర్హత కలిగిన పాఠశాలలకు మధ్యాహ్న భోజనం తయారీకి ఫైన్‌రైస్‌ను అందించామన్నారు.

వనదుర్గమ్మకు ఘనంగా ప్రత్యంగిర హోమం



వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం పూర్ణాహుతి నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరి దుర్గామాతగా పూజలందుకుంటున్న వనదుర్గ అమ్మవారికి జ్యేష్ఠ పౌర్ణిమ సందర్భంగా బుధవారం ఘనంగా ప్రత్యంగిర హోమం నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటలకు వనదుర్గ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం పండితులు ప్రత్యంగిర హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలను సమర్పించి ఘనంగా పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. ప్రత్యంగిర హోమం, పూజ కార్యక్రమాలను వేద పండితులు నిర్వహించారు. 40 మంది భక్తులు రూ.750 చొప్పున టికెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు. దీంతో భక్తులకు హోమ మంటపం సరిపోక ఇబ్బంది పడ్డారు.

నేడు కనకదుర్గ అమ్మవారికి చండీ హోమం
కొండ దిగువన తొలిపావంచా వద్ద కొలువైన కనకదుర్గ అమ్మవారి జన్మనక్షత్రం మూల నక్షత్రం సందర్భంగా గురువారం చండీహోమం నిర్వహిస్తారు. శుక్రవారం వనదుర్గ అమ్మవారికి చండీహోమం నిర్వహిస్తారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి జరిగే ఈ హోమాలలో రూ.750 టిక్కెట్‌తో భక్తులు పాల్గొనవచ్చునని అధికారులు తెలిపారు.

సత్యదేవుని దర్శించిన 40 వేల మంది



అన్నవరం: రత్నగిరి సత్యదేవుని ఆలయం బుధవారం భారీ సంఖ్యలో విచ్చేసిన భక్తులతో పోటెత్తింది. సుమారు 40 వేలమంది భక్తులు సత్యదేవుని ఆలయానికి తరలి వచ్చారు. సత్యదేవుని దర్శనానికి గంట, ప్రత్యేక దర్శనానికి అరగంట సమయం పట్టింది. స్వామివారి వ్రతాలు రెండువేలు నిర్వహించారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షలు ఆదాయం సమకూరింది. సుమారు ఐదువేల మంది భక్తులకు సత్యదేవుని నిత్యాన్నదానపథకంలో ఉచిత భోజన సౌకర్యం కలుగ చేశారు.

జర్నలిస్టులపై అక్రమ కేసులు దారుణం



సూర్యనారాయణ రావు, ఎమ్మెల్సీ

అమలాపురం టౌన్: రాష్ట్రంలో సీనియర్ జర్నలిస్టులు, వైఎస్సార్ సీపీ నాయకులపై కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు నమోదు చేసి వేధించడం దారుణమని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు అన్నారు. ముఖ్యంగా సీనియర్ జర్నలిస్టులు కొమ్మినేని శ్రీనివాస రావు, కృష్ణంరాజులపై అక్రమ కేసులు పెట్టడాన్ని ఎమ్మెల్సీ ఖండించారు. అమలాపురం హైస్కూలు సెంటరులోని తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు బుధవారం సాయంత్రం స్థానిక మీడియాతో మాట్లాడారు. ఈ అక్రమ కేసులను చూస్తుంటే మనం ప్రజాస్వామ్యంలో ఉన్నామా? కక్ష సాధింపు చర్యల్లో ఉన్నామా? అనే సందేహం కలుగుతోందన్నారు. డైవర్షన్ పాలిటిక్స్‌తో ప్రభుత్వం 'సాక్షి' కార్యాలయాల ఎదుట ధర్నాలు, కేసులు అనే కొత్త నాటకానికి తెర తీసిందని చెప్పారు. భారత రాజ్యాంగంలో నాలుగో స్తంభంగా ఉన్న జర్నలిజాన్ని నేటి కూటమి ప్రభుత్వం ఖతం చేసే ప్రయత్నంలో ఉందని అన్నారు. ప్రభుత్వం కూటమి పార్టీల నేతలకే రక్షణగా నిలుస్తోందని విమర్శించారు. తుపాకీ గొట్టంతో రాజ్య హింస ద్వారా నియంత పాలన రుచి చూపిస్తోందని ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు ఆరోపించారు.

పల్లె ప్రగతి ప్రశ్నార్థకం



- పంచాయతీలకు అందని 15వ ఆర్థిక సంఘం నిధులు
- కేంద్రం మంజూరు చేసి రెండు నెలలైనా రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వని వైనం
- నిధుల లేమితో అభివృద్ధికి నోచుకోని గ్రామాలు
- తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా 299 పంచాయతీలు

సాక్షి, రాజమహేంద్రవరం: వ్యవస్థల నిర్వీర్యమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. గ్రామాభివృద్ధికి దోహదపడే గ్రామ సచివాలయ వ్యవస్థను ఇప్పటికే నిర్వీర్యం చేసింది. వ్యవసాయ రంగం కుదేలయ్యేలా చేసింది. తాజాగా గ్రామ పంచాయతీలను నాశనం చేసేందుకు కంకణం కట్టుకుంది. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం రెండో విడత నిధులు పంచాయతీలకు ఇవ్వకుండా ఆపేసింది. వెరసి గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు పడకేశాయి.

గ్రామాభివృద్ధే ధ్యేయమని గొప్పలు
గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధితోనే రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి సాధ్యమని సార్వత్రిక ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఉపన్యాసాలు ఇచ్చారు. పంచాయతీల అభివృద్ధికి కేంద్రం మంజూరు చేసే నిధులు వినియోగిస్తామని చెప్పారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఆర్థిక సంఘం నిధులు మళ్లించి పంచాయతీలను నిర్వీర్యం చేశారని విమర్శలు గుప్పించారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం కేంద్రం ఇచ్చిన నిధులు ఎందుకు ఆపేసిందన్న ప్రశ్న ప్రజల్లో ఉత్పన్నమవుతోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఆర్థిక సంఘం, ప్రభుత్వ నిధులతో గ్రామాల్లో మౌలిక వసతులు కల్పనకు పెద్దపీట వేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఏ పనులూ ఆగకుండా చర్యలు తీసుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పంచాయతీలను నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నాలు చేపడుతోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.





గోపాలపురంలో అధ్వానంగా పారిశుధ్యం

నిధుల విడుదల ఇలా..
గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు జనాభా ప్రాతిపదికన కేంద్రం ఏటా ఆర్థిక సంఘం నిధులు మంజూరు చేస్తుంది. ఆ నిధులను ఏడాదికి రెండు, గరిష్టంగా నాలుగు విడతలుగా విడుదల చేస్తుంది. కేంద్రం విడుదల చేసిన నిధులు తొలుత రాష్ట్ర ప్రభుత్వానికి చేరతాయి. అక్కడి నుంచి పంచాయతీ ఖాతాల్లోకి జమ అవుతాయి.

రెండో విడతకు విముక్తి కలిగేనా..?
కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం 2024–25 ఆర్థిక సంఘం నిధులు తొలి విడతగా 2024 నవంబర్ మాసంలో కేంద్రం విడుదల చేసింది. రెండో దశ నిధులు విడుదల చేసి దాదాపుగా రెండు నెలలవుతోంది. కానీ నేటికీ సర్పంచ్‌లకు చేరిన దాఖలాలు లేవు. రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడు విడుదల చేస్తుందా..? అని సర్పంచులు నిరీక్షించాల్సిన పరిస్థితి తలెత్తింది. వెరసి పల్లెల్లో ప్రగతి పడకేసింది. సీసీ రోడ్లు, కాలువల పనులు జరగడం లేదు. వీధుల్లో సరైన రహదారులు లేక మట్టిరోడ్ల పైనే గ్రామీణ ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. కేవలం ఇంటి పన్నులు సిబ్బంది జీతాలు, పారిశుధ్యం, విద్యుత్ దీపాల నిర్వహణకే సరిపోవడం లేదన్న ఆరోపణలున్నాయి. పల్లెల అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం కనీసం శ్రద్ధ చూపడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం
పంచాయతీల్లో నిధుల లేమితో మురుగునీటి పారుదల వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. డ్రైనేజీలు శిథిలమైనా మరమ్మతులు చేపట్టేందుకు నిధుల సమస్య వెంటాడుతోంది. కొత్తగా కాలువల నిర్మాణాలు జరగడం లేదు. వాడుక నీరు వీధుల్లోనే ప్రవహిస్తున్నా పట్టించుకునేవారే కరవయ్యారు. మురుగునీరు నిల్వ ఉండి దోమలకు నిలయాలుగా మారుతున్నాయి. ప్రజారోగ్యంపై ప్రభావం చూపుతున్నాయి. వీధి దీపాల నిర్వహణపై నిధుల కొరత ప్రభావం పడుతోంది. కొన్ని పల్లెల్లో వీధి దీపాలు వెలగడం లేదు.

స్తంభించిన పనులు

ఆర్థిక సంఘం నిధుల విడుదలలో ఆలస్యం చోటు చేసుకోవడంతో గ్రామాల్లో పనులు ముందుకు సాగడం లేదు. ఆర్థిక సంఘం నిధులను టైడ్ ఇన్‌స్టాల్‌మెంట్, బేసిక్ ఇన్‌స్టాల్‌మెంట్ అని రెండు పద్ధతుల్లో జమ చేస్తారు. గ్రామంలోని జనాభా ప్రాతిపదికన ఈ నిధులు వస్తుంటాయి. పంచాయతీల్లో కొన్ని నిర్ణీత పనులకు 50 శాతం నిధులను, మిగిలిన నిధులు ఇతర పనులకు వినియోగిస్తుంటారు. సిమెంట్ రోడ్లు, డ్రెయినేజీ, తాగునీటి ట్యాంకులో ఫిల్టర్ బెడ్‌లో ఇసుక మార్పిడికి ఇలా అనేక పనులకు నిధులు వెచ్చిస్తారు. అభివృద్ధి పనులకు ముందుగా ఖర్చు చేయాల్సి ఉంటుంది. అనంతరం బిల్లులు పెట్టి నిధులు తీసుకోవాల్సి ఉంటుంది. పంచాయతీ సర్పంచులు ఖర్చు పెడుతున్నా.. బిల్లులు తీసుకునేందుకు నిధులు ఉండటం లేదు. పాలకులు ఆర్థికంగా అవస్థలు పడుతున్నారు. ప్రధానంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ పంచాయతీల్లో నిధుల కొరత వేధిస్తోంది.

జిల్లాలో రూ.80 కోట్ల పెండింగ్
జిల్లావ్యాప్తంగా 299 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 15వ ఆర్థిక సంఘం నిధులు 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సుమారు రూ.80 కోట్లు ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం నిలిపివేసింది. ఈ పరిణామం ప్రజల్లో విమర్శలకు తావిస్తోంది. ఆర్థిక సంఘం నిధుల కోసం పంచాయతీల పాలకులు ఎదురుచూస్తున్నారు.

పవన్ స్పందించరా..?
గ్రామాల అభివృద్ధికి పాటుపడుతున్నామని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నిత్యం ప్రసంగాల్లో ఉపన్యాసాలు ఇస్తుంటారు. పైగా ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న శాఖ. కేంద్రంతో సత్సంబంధాలు ఉన్న నేత. అలాంటి సమయంలో పంచాయతీల నిధులు ఆపితే ఏం చేస్తున్నారంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయకపోతే గ్రామాలు ఏ విధంగా అభివృద్ధి చెందుతాయో పాలకులే స్పష్టం చేయాలన్న వాదన వినిపిస్తోంది.

జాతీయ ఎస్టీ కమిషన్ సిఫారసులు అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సూర్యనారాయణ తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): జాతీయ ఎస్టీ కమిషన్ 2018లో పోలవరం ముంపు ప్రాంతాల్లో పర్యటించి రాష్ట్రపతికి ఒక నివేదిక సమర్పించిందని, ఆ నివేదిక ప్రకారం కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆదివాసీ మహాసభ న్యాయసలహాదారు అయినాపురపు సూర్యనారాయణ విమర్శించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బుధవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోలవరం ఎస్టీ నిర్వాసితుల విషయంలో చట్టాలను ఉల్లంఘిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులలో 53శాతం మంది గిరిజనులున్నారని, వీరి విషయంలో ప్రభుత్వం, అధికారులు చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తూ కోర్టు ధిక్కరణకు పాల్పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ రూ.11.80 లక్షల వరకు చెల్లించాల్సి ఉందన్నారు. కొత్త భూసేకరణ చట్టం రూల్ 24 ప్రకారం భూమిలేని ఎస్సీ, ఎస్టీ నిర్వాసితులకు ఒక్కొక్క కుటుంబానికి కనీసం ఎకరం భూమి కేటాయించాలని డిమాండ్ చేశారు. గిరిజనులకు సరైన న్యాయం చేసే వరకు వారికి అండగా ఉంటామని స్పష్టం చేశారు. సమావేశంలో నెసిక లక్ష్మణరావు, బూరమ్మ, వీరమ్మ, రాజమణి పాల్గొన్నారు.

మిథ్యారంభం కరిష్యామి!

- నేడు పాఠశాలల పునఃప్రారంభం
- జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 94,354 మంది
- పూర్తిగారాని విద్యార్థుల స్కూల్ కిట్‌లు
- కొనసాగుతున్న టీచర్ల బదిలీలు



రాజమహేంద్రరంలోని కుసుమ నాగన్న మున్సిపల్ పాఠశాల

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లావ్యాప్తంగా గురువారం పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. అయితే ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్న చందాన తయారైంది నేటి ప్రభుత్వంలో విద్యావ్యవస్థ. గత ప్రభుత్వ హయాంలో పాఠశాలలు తెరవకుండానే, వేసవి సెలవుల్లోనే విద్యార్థులకు అందాల్సిన టెక్ట్స్‌బుక్స్, నోట్ బుక్స్, బ్యాగులు, షూస్, యూనిఫాంలు వచ్చేసి స్టాక్ పాయింట్లలో ఉండేవి. జిల్లాలోని 19 మండలాల్లో 984 ప్రభుత్వ స్కూల్స్ ఉన్నాయి. వీటిలో బాలురు 44,771 మంది, బాలికలు 49,583 మంది ఉన్నారు. టెక్స్టుబుక్స్, నోట్‌బుక్స్ వంటివి జిల్లాకు చేరినా అవి ఇంకా మండలాల నుంచి స్కూల్స్‌కు చేరలేదు. బ్యాగులు 94,354 రావాల్సివుండగా 67,158 మాత్రమే 13 మండలాలకు చేరాయి. 94,354 షూస్ రావాల్సి వుండగా 64,726 మంది విద్యార్థులకే వచ్చాయి. యూనిఫాం అయితే కనీసం 10 మండలాలకు కూడా ఇంకా రాలేదు. 94,354 యూనిఫాంలకు 50,549 మాత్రమే వచ్చాయి. ఇంకా 40,805 యూనిఫాంలు రావాల్సి వుంది.

అంసంపూర్తిగా తరగతి గదులు, టాయిలెట్స్
నూతన విద్యాసంవత్సరం ప్రారంభంలో ఉత్సాహంతో స్కూల్స్‌కు వెళ్లే విద్యార్థులకు రంగులు వెలసిపోయిన విద్యాలయాలే కనిపించనున్నాయి. పాఠశాలలు తెరిచే నాటికి నాడు – నేడు పనులు పూర్తి చేసి విద్యాలయాలను సిద్ధం చేయాల్సి వుండగా నిర్లక్ష్యంగా సగం పనులతో వాటిని అలాగే వదిలేశారు. దీంతో పాఠశాలల్లో టాయిలెట్స్ నిరుపయోగంగా మారాయి. స్కూల్స్‌కు రంగులు వేయలేదు. కొన్ని స్కూల్స్‌లో అదనపు తరగతి గదుల నిర్మాణం ప్రారంభించారు. అవి అసంపూర్తిగానే మిగిలిపోయాయి. కొన్ని పాఠశాలలకు అయితే కిటికీలు, తలుపులు ఇంకా బిగించలేదు.

పూర్తికాని ఉపాధ్యాయ బదిలీలు
జిల్లాలో జరుగుతున్న ఉపాధ్యాయుల బదిలీలు పూర్తికాలేదు. స్కూల్‌కు వెళ్లి పాఠాలు బోధించాల్సిన ఉపాధ్యాయులకు వారి బదిలీలు ఇంకా అగమ్యగోచరంగా ఉండడంతో ఏం చేయాలో తెలీని పరిస్థితిలో ఉన్నారు. ప్రాథమిక పాఠశాలలో బోధించే ఎస్‌జీటీల కౌన్సెలింగ్ పూర్తికాలేదు. దీంతో పాత పాఠశాలల్లోనే ఎస్‌జీటీలు ఉండిపోయారు. అయితే ప్రధానోపాధ్యాయులు మాత్రం నూతనంగా వచ్చారు. వేసవి కాలం సెలవుల్లో పూర్తి చేయాల్సిన బదిలీలు పూర్తి నిర్లక్ష్యంతో పాఠశాలలు తెరిచే వరకూ కూడా పూర్తి చేయలేదు. హామీ ఇచ్చిన ఎస్‌జీటీలకు మాన్యువల్ బదిలీలు చేయకుండా ఆన్‌లైన్ ప్రక్రియ చేపట్టడంతో వారు ఆందోళన చేశారు. తప్పు తెలుసుకున్న ప్రభుత్వం ఎట్టకేలకు మాన్యువల్ బదిలీలకు ఒప్పుకుంది. అయితే ఇప్పటికే ఆలస్యం కావడంతో దీనివల్ల గురువారం కూడా బదిలీల ప్రక్రియ కొనసాగనుంది.

రైతుల నడ్డి విరుస్తున్న కూటమి ప్రభుత్వం

మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాలకృష్ణ



రాజమహేంద్రవరం రూరల్: ధాన్యం కొనుగోలు చేయకుండా, ఇన్సూరెన్స్ చెల్లించకుండా ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం రైతుల నడ్డి విరుస్తుంటే, మరోవైపు కేంద్రం కేవలం మూడు శాతం మాత్రమే వరిపై మద్దతు ధర పెంచడం దారుణమని మాజీ మంత్రి ,వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాలకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం బొమ్మూరులోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ పక్కనే ఉన్న ఒడిశా ప్రభుత్వం వరిపై కనీస మద్దతు ధరకు 800 రూపాయలు బోనస్ చెల్లించి క్వింటాల్ వరిని కొనుగోలు చేస్తోందన్నారు. తెలంగాణ ప్రభుత్వం కూడా రూ.500 అదనంగా చెల్లిస్తుండగా మన రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయకుండా రైతులకు పెట్టుబడి సహాయం ఏడాదికాలంగా అందించకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. ఓవైపు పెట్టుబడులు పెరిగిపోతున్న సమయంలో రాష్ట్ర ప్రభుత్వం ఈ రకంగా వ్యవహరించడం సరికాదని రైతులు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. పక్క రాష్ట్రాలు బంజరు భూములను కూడా వరి భూములుగా మారుస్తుంటే మన రాష్ట్రంలో మాత్రం మూడు పంటలు పండే భూములను రాజధాని పేరిట లాక్కుంటున్నారని వేణు ఆవేదన వ్యక్తం చేశారు .

రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయి
రాష్ట్రంలో శాంతి భద్రతలు కూటమి ప్రభుత్వ పాలనలో దారుణంగా క్షీణించాయని మాజీ మంత్రి వేణుగోపాలకృష్ణ పేర్కొన్నారు. డిబేట్లో మాట్లాడిన అంశాన్ని ఆధారంగా చేసుకుని సీనియర్ జర్నలిస్టు కేఎస్ఆర్‌ను అరెస్టు చేయడం, సాక్షి కార్యాలయాలపై దాడులు నిర్వహించటం దారుణమన్నారు. ఎమ్మెల్యేలు ఆధ్వర్యంలో దాడులు జరుగుతుంటే పోలీసులు ప్రేక్షక పాత్ర వహించడం రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి ఏ విధంగా ఉందో స్పష్టం చేస్తోందన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన సంక్షేమ పథకాలకు నాలుగురెట్లు ఇస్తానని చెప్పిన సంవత్సరకాలంలో చేయకుండా చంద్రబాబు మహిళలను, రైతులను, అన్ని వర్గాలను మోసం చేశారన్నారు. ఇప్పుడు సాక్షి డిబేట్‌లో ఒక ఎనలిస్ట్ అన్నమాటలకు చంద్రబాబు మహిళలను అడ్డుపెట్టుకుని డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారన్నారు. గతంలో తన సతీమణిపై వ్యాఖ్యలు చేస్తే చంద్రబాబు ఎంతో మనోవేదన చెందారన్నారు. ఇప్పుడు ఏబీఎన్‌లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పై వ్యక్తిత్వ హననం చేస్తూ, ఆయన సతీమణి భారతమ్మపై దుష్ప్రచారం చేస్తుండడాన్ని సభ్యసమాజం తలదించుకుంటోందన్నారు. ప్రజలు ప్రతి అంశాన్ని గమనిస్తున్నారని కచ్చితంగా కూటమి పార్టీలకు బుద్ధి చెబుతారన్నారు.

దివ్యాంగుల పింఛన్లలో కోత తగదు



విలేకరులతో మాట్లాడుతున్న దివ్యాంగుల హక్కుల వేదిక జాతీయ అధ్యక్షుడు నాగేశ్వరరావు

కాకినాడ సిటీ: దివ్యాంగుల పింఛన్లలో భారీ కోత పెట్టే దిశగా కూటమి ప్రభుత్వం ప్రయత్నించడం సరికాదని అఖిల భారత దివ్యాంగుల హక్కుల వేదిక జాతీయ అధ్యక్షుడు కొల్లి నాగేశ్వరరావు ఖండించారు. కాకినాడ ఆర్అండ్‌బీ అతిథి గృహంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. పింఛన్ల తనిఖీ పేరుతో రాష్ట్రంలో దివ్యాంగులను ప్రభుత్వం అవమానిస్తోందని ఆరోపించారు. పింఛన్ల తనిఖీకి హాజరయ్యే క్రమంలో అనేక మంది దివ్యాంగులు ఆసుపత్రి పాలవుతున్నారని విచారం వ్యక్తం చేశారు. ఇటువటి విధానాలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విడనాడి దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. దివ్యాంగుల హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖండవిల్లి భరత్‌కుమార్ మాట్లాడుతూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కరప, ముమ్మిడివరం మండలాల్లో మానసిక మహిళ దివ్యాంగులపై అత్యాచార ఘటన జరపడం దురదృష్టకరమన్నారు. జరిగిన సంఘటనపై రాష్ట్ర హోంమంత్రి ఇప్పటి వరకు స్పందించకపోవడం బాధ్యతారాహిత్యమన్నారు. ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను భర్తీ చేయాలని, 35 కేజీల బియ్యం పథకాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలని, 2016 దివ్యాంగుల హక్కుల చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. నామినేటెడ్ పదవుల్లో దివ్యాంగులకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. సంఘ జాతీయ కార్యదర్శి ముత్యాల పోసికుమార్, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు పలివెల రాజు పాల్గొన్నారు.

పంచ భూతాలను కాపాడుకోవాలి



ఏరువాక సాగుతున్న ఉమర్ ఆలీషా

ఏరువాక సాగిన పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా

పిఠాపురం: ప్రకృతి వ్యవసాయాన్ని అనుసరించడం ద్వారా పంచ భూతాలను కాపాడుకోవచ్చునని శ్రీ విశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా అన్నారు. ఏరువాక పౌర్ణమిను పురస్కరించుకుని పిఠాపురం, ఆశ్రమ ప్రాంగణంలో బుధవారం సస్యవృద్ధి బీజారోపణోత్సవం ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ ఆరు సంవత్సరాలుగా తమ ఆశ్రమం వద్ద ఏరువాక పౌర్ణమి నిర్వహిస్తున్నామని వెల్లడించారు. సేంద్రియ పద్ధతుల ద్వారా ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులను సాధించడమే ఆధ్యాత్మిక వ్యవసాయమని అన్నారు. దానికి ప్రేరణ కలిగించే కార్యక్రమమే సస్యవృద్ధి బీజారోపణోత్సవం అని తెలిపారు. అనంతరం నిర్వహించిన సభలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న దారపురెడ్డి వెంకన్న, దార్లంక సూరిబాబు, యాండ్ర చంద్రావతి, దాసరి పెద్దనాగేశ్వరరావు, గుళ్ళపల్లి వీరభద్రరావును సత్కరించారు. పరబ్రహ్మ మొహియద్దీన్ బాద్షా ఆధ్యాత్మిక వ్యవసాయం 2025 పురస్కారాన్ని పశ్చిమగోదావరి జిల్లా చీమలవారిగూడెంకు చెందిన చీమల వెంకటేష్‌కు అందజేసి రూ.10వేల నగదు పురస్కారాన్ని, జ్ఞాపికను ఇచ్చి సత్కరించారు. అనంతరం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రధాన శాస్త్రవేత్త నడింపల్లి రామగోపాలవర్మ డ్రోన్లతో వ్యవసాయం గురించి రైతులకు వివరించారు. అంబాజీపేట హార్టికల్చర్ పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎన్.బి.వి చలపతి వివిధ పంటలలో జీవ నియంత్రణ పద్ధతులను తెలిపారు. ప్రకృతి వ్యవసాయ నిపుణులు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మాజీ జాయింట్ సెక్రటరీ వాసంశెట్టి సత్య నారాయణ మూర్తి, గోలి సుభాష్, పృథ్వీరాజ్ కతారి, పాత్రు శశికాంత్ సమీకృత ప్రకృతి వ్యవసాయంపై మాట్లాడారు. కెప్టెన్ అజ్జరపు మల్లికార్జునరావు, ఎస్సార్ కార్పొరేషన్ మాజీ సీఈవో జి.వి.కృష్ణంరాజు గో ఆధారిత ప్రకృతి వ్యవసాయం గురించి తెలిపారు. పీఠం సెంట్రల్ కమిటీ సభ్యులు, పీఠం కన్వీనర్ పేరూరి సూరిబాబు, మీడియా కన్వీనర్ ఆకుల రవితేజ పాల్గొన్నారు.

గోదారి తీరాన సంగీత, నృత్యోత్సవం

- నేటి నుంచి అంతర్జాతీయ సంగీత, నృత్య ఫెస్ట్–2025
- నాలుగు రోజుల పాటు సాగనున్న ఉత్సవాలు
- 13 రాష్ట్రాల నుంచి కళాకారుల రాక
- మలేషియా నుంచి రానున్న ప్రత్యేక బృందం
- 13వ తేదీన 134 మందితో నృత్య నీరాజనం


హనుమాన్ చాలీసా నృత్యరూపకాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు (ఫైల్)

సీటీఆర్ఐ: నృత్య నీరాజనంతో గోదారితీరం పులకించనుంది. వంద మందికి పైగా నృత్య కళాకారులు ఒకే వేదికపై నాలుగు రోజులపాటు నగర ప్రజలను పరవశింపజేయనున్నారు. 42 ఏళ్లుగా కళా సమ్మేళన్ పేరితో సంగీత, నృత్యోత్సవాలు నిర్వహిస్తున్న శ్రీరాధాకృష్ణ కళాక్షేత్ర, భారతీయ యువ సేవా సంఘ్ ఆధ్వర్యంలో శ్రీవేంకటేశ్వర ఆనం కళాకేంద్రం వేదికగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. 43వ కళా సమ్మేళన్ అంతర్జాతీయ సంగీత, నృత్య ఫెస్ట్–2025 గురువారం వైభవంగా ప్రారంభం కానుంది.

ఈ సమ్మేళన్‌లో 13 రాష్ట్రాల నుంచి కళాకారులు పాల్గొననున్నారు. వీరితో పాటుగా మలేషియా నుంచి ఒక ప్రత్యేక బృందం రానుంది. సుమారు 550 మంది కళాకారులు మూడు రోజుల పాటు సంగీతం, నృత్య, జానపద కళారూపాలతో పోటీ పడనున్నారు. శుక్రవారం 134 మంది తొమ్మిది గంటల తొమ్మిది నిమిషాల తొమ్మిది సెకండ్ల పాటు నిర్విరామంగా ఒకే ఆహార్యంతో నృత్యం చేయనున్నారు. వీరితో పాటు 9 మంది సంగీత విద్యాంసులు కూడా పాల్గొనున్నారు. ఈ నృత్యోత్సవాన్ని పలు రికార్డులకు నమోదు చేయనున్నారు. గత ఏడాది అంతర్జాతీయ సంగీత, నృత్యోత్సవం అనేక రికార్డులను సొంతం చేసుకుంది. 12 గంటల 23 నిమిషాల 01 సెకండ్‌పాటు 125 మంది కళాకారులు ఒకే ఆహార్యంతో ప్రదర్శించిన హనుమాన్ చాలీసా నృత్యరూపకానికి 12 ప్రపంచ రికార్డులు నమోదయ్యాయి. గిన్నిస్‌బుక్ ఆఫ్ రికార్డ్స్, లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్, జీనియస్ బుక్, వండర్ బుక్, తెలుగు బుక్, గోల్డెన్‌బుక్ వంటి 12 వరల్డ్ రికార్డులను ఆ కార్యక్రమం సొంతం చేసుకోవడం విశేషం. 14వ తేదీ 13న బృందాలు పోటీ పడనున్నాయి. ఒక్కొక్క బృందంలో 25 నుంచి 30 మంది వరకు కళాకారులు పాల్గొననున్నారు. 15వ తేదీ సోలో పోటీలు, సర్టిఫికెట్ల ప్రదానం చేయనున్నారు.

శాస్త్రీయ నృత్యానికి ఆదరణ కరవు



పాశ్చాత్య సంగీతం, నృత్యం వైపు నేటి తరం ఎక్కువగా ఆసక్తి చూపుతోంది. తల్లితండ్రులు కూడా త్వరగా తమ పిల్లలకు పేరు వస్తుందనే ఆశతో పాశ్చాత్య నృత్యం వైపు తమ పిల్లలను పంపుతున్నారు. టీవీ షోలలో అసభ్యకరమైన విన్యాసాలతో, పొట్టి డ్రెస్‌లతో చేసేది నాట్యమని భ్రమిస్తున్నారు. మన ప్రాచీన కళైన సంప్రదాయ నృత్యం వైపు ప్రపంచం చూస్తోంది. మనం మాత్రం ఆధునిక పోకడలతో తలతోక లేని డ్యాన్స్ వైపు పరుగెడుతున్నాం.

– డాక్టర్ జీబీ నారాయణ, శ్రీరాధాకృష్ణ కళాక్షేత్ర వ్యవస్థాపకుడు


9 గంటల 9 నిమిషాల 9 సెకన్ల నృత్య రూపకంలో లక్ష్మీదీపిక

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 – 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	24,500
గటగట (వెయ్యి)	22,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	23,500
గటగట (వెయ్యి)	21,500
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	14,500 – 15,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	15,000 – 15,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

క్లుప్తంగా

గల్లంతైన మృతదేహం లభ్యం


వాసాలతిప్పలో మృతదేహాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ దివాకర్, ఎస్ఐ రాజేష్

ఉప్పలగుప్తం: మండలంలోని ఎస్.యానం బీచ్‌కు స్నానాలకు వెళ్లి సముద్రంలో మంగళవారం గల్లంతైన ఇద్దరిలో రెండో యువకుడి మృతదేహం బుధవారం లభ్యమైంది. అంబాజీపేట మండలం మాచవరం గ్రామానికి చెందిన యాళ్ల హరికిశోర్ మృత దేహం మంగళవారమే లభ్యమైనప్పటికీ మరో యువకుడు ఇసుకపట్ల జస్వంత్ కోసం అధికారులు గాలింపు చర్యలు చేపట్టగా బుధవారం ఉదయం వాసాలతిప్ప సముద్రతీర ప్రాంతంలో లభ్యమైనట్లు ఎస్సై సీహెచ్ రాజేష్ తెలిపారు. ఆ మృత దేహాన్ని తహసీల్దార్ వీఎస్ దివాకర్, ఎస్ఐ రాజేష్ పరిశీలించి పోస్టుమార్టమ్ నిమిత్తం తరలించి కుటుంబ సభ్యులకు అందించారు.

యువకుడి ఆత్మహత్య


కృష్ణచైతన్య మృతదేహం

యానాం: పిన్ని ఇంటికి వచ్చి యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బుధవారం యానాం పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పశ్చిమగోదావరి జిల్లా తణుకు పట్టణం, జయంతి కాలనీకి చెందిన గంధ్రాపు వెంకటకృష్ణచైతన్య (24) యానాంలో వికాస్‌కాలనీలో నివాసం ఉంటున్న తన పిన్ని ఇంటికి ఇటీవల వచ్చాడు. బుధవారం మధ్యాహ్నం ఫ్యాన్‌కు ఉరివేసుకుని వేలాడుతున్న కృష్ణచైతన్యను చూసిన బంధువులు హుటాహుటిన కిందకు దింపి యానాం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అతను అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కృష్ణచైతన్య బీటెక్ చదువుకున్నాడని ఆత్మహత్యకు ప్రేమ వైఫల్యమే కారణమని భావిస్తున్నారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీలో ఉంచినట్లు తెలిపారు. ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై పెంకే గణేష్ తెలిపారు.

విగ్రహాన్ని ధ్వంసం చేసిన వ్యక్తి అరెస్టు

తొండంగి: మండలంలోని పెరుమాళ్లపురం పంచాయతీ చింతకాయలపేట రామాలయంలో ఆంజనేయస్వామి విగ్రహం బయటపడేసిన సంఘటనలో వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఎస్సై బి.జగన్మోహనరావు బుధవారం తెలిపారు. సోమవారం అర్ధరాత్రి జరిగిన ఈ సంఘటనకు సంబంధించి పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు ఆధ్వర్యంలో దర్యాప్తు ముమ్మరం చేశారు. కొన్ని సీసీ పుటేజీలతోపాటు రామాలయం వద్ద లభించిన ఆధారాలతో కొత్తపెరుమాళ్లపురానికి చెందిన తిర్రి ప్రసాద్‌గా గుర్తించామన్నారు. ఈ మేరకు అరెస్టు చేసి కోర్టు ప్రవేశపెట్టగా 14 రోజులు రిమాండ్ విధించారన్నారు.

వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు

అమలాపురం టౌన్: అమలాపురం మెయిన్ రోడ్డులోని మలబార్ గోల్డ్ షోరూమ్‌కు ఎదురుగా గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ మోటారు సైకిలిస్ట్ గాయపడ్డాడు. సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో మలికిపురం మండలం తూర్పుపాలేనికి చెందిన కొల్లు కుమారస్వామి మోటారు సైకిల్‌పై వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం అతడిని ఢీకొట్టింది. కుమారస్వామి స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ప్రమాదంపై ఆస్పత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్సై ఎన్ఎస్ కిషోర్‌బాబు తెలిపారు.

పీతల సరఫరాలో ఘరానా మోసం

- పచ్చ పీతలకు బదులు మండ పీతలు పంపిన హేచరీ యాజమాన్యం
- రూ.14 లక్షలు నష్టపోయిన రైతులు

కాట్రేనికోన: పచ్చ పీత పిల్లలకు సొమ్ము చెల్లిస్తే మండ పీత పిల్లలను అంటగట్టి రైతులకు కుచ్చుటోపీ పెట్టిన ఘటన పల్లం గ్రామంలో చోటు చేసుకుంది. మండలం పల్లం గ్రామానికి చెందిన 26 మంది రైతులు 50 ఎకరాలు పీతల చెరువులు లీజుకు చేస్తున్నారు. పచ్చ పీత పిల్లల కోసం స్థానికం హేచరీ అందుబాటులో లేక పోవడంతో మద్రాసుకు చెందిన హేచరీ నుంచి పీత పిల్లలను పల్లం గ్రామానికి చెందిన పాలెపు శ్రీను, సంగాని సత్యంకు సొమ్ము చెల్లించారు. 26 మంది రైతులు ఒక పీత పిల్లకు రూ.23 చొప్పున 60 వేల పిల్లలకు రూ.14 లక్షలను దళారులు పాలెపు శ్రీను, సంగాని సత్యంలకు చెల్లించారు. అయితే పచ్చ పీత పిల్లలకు బదులు నకిలీ పీతలను (మండ పీతల) సరఫరా చేయడంతో తీవ్రంగా నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి వేళ చెరువులో పీత పిల్లలను వదలడం, సీడ్ దశలో ఉండడం వల్ల అసలో నకిలీయో తెలియదని వారు పేర్కొన్నారు. చెరువులో పీతలు వేసి 20 రోజులు పైబడిందని, పచ్చ పీతలకు బదులు మండ పీతలని తేలడంతో మోసపోయినట్టు గుర్తించామని, మండ పీత పిల్లలను సరఫరా చేసిన హేచరీ యాజమాన్యం పైన, దళారులపై కేసు నమోదు చేయాలని కోరుతూ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు.


దళారులు మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతులు

ఉసురు తీసిన వివాహేతర సంబంధం

- భర్తను హత్య చేసిన భార్య
- ప్రియుడితో కలసి పరారీ


మృతిచెందిన కెంగం శ్రీను

బిక్కవోలు: ప్రియుడి మోజులో పడి కట్టుకున్న భర్తనే కడతేర్చింది ఆ ఇల్లాలు. సీఐ వీఎల్‌వీకే సుమంత్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని బిక్కవోలు గ్రామంలోని కెంగం శ్రీను (43) లారీ క్లీనర్‌గా పనిచేస్తున్నారు. స్థానిక జగనన్న లే అవుట్ ప్లాట్ నంబర్ 59లో భార్య దేవితో కలసి కాపురం చేస్తున్నాడు. వారికి ఇద్దరు పిల్లలు కాగా పెద్దవాడు సురేంద్ర సత్యకుమార్ నర్సాపురం మండలం సీతారామపురంలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. రెండో కుమారుడు యశ్వంత్‌కుమార్ పోలవరం మండలం గుటాల గ్రామంలో తాపీ పని చేస్తుంటాడు. దేవి బిక్కవోలులో అంబటి పేట ప్రాంతానికి చెందిన జంపా దుర్గారావుతో వివాహేతర సంబంధం నెరపుతుండడంతో ఆ భార్యాభర్తల మధ్య కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. తల్లి వివాహేతర సంబంధాన్ని చూస్తూ ఉండలేక చిన్న కుమారుడు గుటాలలోని తన అమ్మమ్మ ఇంటికి వెళ్లి పని చేసుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి మళ్లీ శ్రీను, దేవి ఘర్షణపడ్డారు. ఈ ఘర్షణలో శ్రీను మృతి చెందాడు. బుధవారం ఉదయం శ్రీను తల్లి సరస్వతి ఇంటికి రాగా విగతజీవుడై పడి ఉన్న శ్రీనును చూసి కన్నీరుమున్నీరైంది. అనంతరం దేవి తన ప్రియుడు దుర్గారావుతో కలసి శ్రీనును చంపినట్టు పోలీసులకు ఫిర్యాదు చేసింది. డీఎస్పీ శ్రీవిద్య, సీఐ సుమంత్, ఎస్సై వాసంశెట్టి రవిచంద్రకుమార్ ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. శ్రీను భార్య దేవి, దుర్గారావు పరారీలో ఉన్నారని వారిని పట్టుకునేందుకు రెండు ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయని వారు తెలిపారు. శ్రీను మృతదేహాన్ని అనపర్తి సీహెచ్‌సీకి తరలించినట్టు సీఐ తెలిపారు.

సత్యదేవుని సన్నిధికి సులువుగా!


మెట్లదారి పనులను పరిశీలిస్తున్న సీఈ జీవీ శేఖర్ తదితరులు


మెట్లదారి మధ్యలో భక్తులకు విశ్రాంతి షెడ్లు, మంచినీటి సదుపాయం ఏర్పాటుకు చదును చేస్తున్న స్థలం

- చురుగ్గా రెండో మెట్లదారి నిర్మాణం
- రూ.90 లక్షలతో 450 మెట్లు ఏర్పాటు
- ఆగస్టు నెలాఖరుకు అందుబాటులోకి

అన్నవరం: రత్నగిరి సత్యదేవుని సత్యదేవుని దర్శనానికి మరో మార్గానికి పనులు చురుగ్గా సాగుతున్నా యి. మొదటి ఘాట్‌రోడ్డు వద్ద గల టోల్‌గేట్ నుంచి స్వామివారి ఆలయం సమీపం వరకు నిర్మిస్తున్న రెండో మెట్లదారి నిర్మిస్తున్న విషయం తెలిసిందే. రూ.90 లక్షల వ్యయంతో సుమారు 450 మెట్లతో ఆకర్షణీయంగా ఈ మార్గం రూపుదిద్దుకుంటోంది.

రాజస్థాన్ కార్మికుల మెళకువలతో

రాజస్థాన్ నుంచి తీసుకువచ్చిన మెషీన్‌తో అందమైన పరిమాణాల్లో కట్ చేసిన రాళ్లను మెట్లుగా తీర్చిదిద్దుతున్నారు. తొలిపావంచా నుంచి స్వామివారి ఆలయానికి ఉన్న ప్రస్తుతం మెట్లను సుమారు 50 ఏళ్ల క్రితం రాతితో నిర్మించారు. కాగా ప్రస్తుతం నిర్మిస్తున్న రెండో మెట్లమార్గానికి గ్రానైట్, మార్బుల్ రాళ్లను యంత్రాలతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు.

2010లోనే ప్రతిపాదన

2010 సంవత్సరంలో అప్పటి ఈఓ, ప్రస్తుత దేవదాయశాఖ ఇన్‌చార్జి కమిషనర్ కె.రామచంద్రమోహన్ ఈ మెట్ల దారి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. దేవస్థానం కళాశాల మైదానంలో సందర్శకుల బస్సులు, ఇతర వాహనాలను నిలిపి అక్కడి నుంచి తొలి పావంచా వద్దకు నడిచి వెళ్లి అక్కడ నుంచి మెట్లపై స్వామివారి దర్శనానికి వెళ్లాల్సివచ్చేది. ఇది దూరాభారం కావడంతో కళాశాల మైదానానికి దగ్గరలో మరో మెట్లదారి నిర్మించాలని ఆయన సంకల్పించారు. ఇంతలో ఆయన 2012లో బదిలీకావడంతో ఆ ప్రతిపాదన మూలపడింది. మళ్లీ 2023లో ఆయన ఈఓగా రావడంతో ఈ మెట్ల మార్గం పనులకు టెండర్లు పిలిచి ఖరారు చేశారు.


సత్యనారాయణ స్వామివారి దేవస్థానం

మూడు మలుపులు, 450 మెట్లు

ఈ మార్గాన్ని 450 మెట్లతో మూడు మలుపులతో నిర్మిస్తున్నారు. మొదటి ఘాట్‌రోడ్ టోల్‌గేట్ నుంచి మెట్లు ప్రారంభమై రత్నగిరిపై ఓల్డ్ సీసీ, న్యూ సీసీ సత్రాల రోడ్డు వద్ద ముగియనున్నాయి. అక్కడ నుంచి 200 మీటర్ల దూరంలోనే స్వామివారి ఆలయం ఉంటుంది.

గత ఏప్రిల్‌లో ప్రారంభించిన పనుల్లో భాగంగా వంద మెట్లు పూర్తి చేశారు. ఇంకా 350 మెట్లు నిర్మించాల్సి ఉంది. ఈ మెట్లకు అవసరమైన రాయిని ప్రత్తిపాడులోని క్వారీ నుంచి తీసుకువచ్చి మెట్లుగా తీర్చిదిద్దుతున్నారు.

భక్తుల విశ్రాంతికి ఏర్పాట్లు

మెట్ల మార్గంలో వెళ్లే భక్తులు అలసట చెందితే విశ్రాంతి తీసుకునేందుకు వీలుగా షెడ్లు, తాగునీటి సదుపాయానికి పక్కనే కొంత స్థలాన్ని చదును చేస్తున్నట్టు అధికారులు తెలిపారు.

మూడు నెలల్లో పూర్తి

ఈ మెట్ల నిర్మాణాన్ని ఆగస్టు నెలాఖరు నాటికి పూర్తిచేయనున్నట్టు దేవస్థానం ఈఈ వి.రామకృష్ణ, డీఈ ఉదయ్‌కుమార్ తెలిపారు.

పనుల పరిశీలన

దేవదాయశాఖ చీఫ్ ఇంజినీర్ జీవీ శేఖర్ ఈ మెట్ల మార్గం పనులను ఇటీవల పరిశీలించిన సంతృప్తి వ్యక్తం చేశారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో ఓవరాల్ చాంప్స్ 'తూర్పు'

67 పతకాలు కైవసం


రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో ఓవరాల్ చాంపియన్ షిప్ సాధించిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జట్టు

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): అనంతపురం జిల్లా తాడిపత్రిలో ఈ నెల తొమ్మిదో తేదీ నుంచి 11 వరకు జరిగిన రాష్ట్రస్థాయి అంతర్ జిల్లాల తైక్వాండో పోటీలలో ఉమ్మడి తూర్పుగోదావరి జట్టు పాల్గొని ప్రతిభ కనపరచిందని తైక్వాండో సంఘ జిల్లా కార్యదర్శి బి.అర్జునరావు బుధవారం తెలిపారు. ఉమ్మడి తూర్పు గోదావరి నుంచి 80 మంది ఈ పోటీలలో పాల్గొనగా 38 బంగారు, 12 రజత, 17 కాంస్య పతకాలు సాధించి జిల్లా క్రీడాకారులు ఓవరాల్ చాంపియన్ షిప్‌ను కై వసం చేసుకున్నారన్నారు. కడప జిల్లా ద్వితీయ స్థానాన్ని, అనంతపురం జిల్లా తృతీయ స్థానాన్ని కై వసం చేసుకున్నాయని తెలిపారు. ఈ పోటీలో జాతీయస్థాయి రిఫరీలు భార్గవి, సాయి, రోహిత్ జిల్లా నుంచి పాల్గొనగా తైక్వాండో కోచ్‌లు సత్యనారాయణ, మణికంఠ, త్రిమూర్తులను అర్జునరావు అభినందించారు.

ప్రాచీన ఆలయాల సందర్శన


బిక్కవోలులోని ఆలయంలో శ్రీప్రజ్ఞానంద సరస్వతి

బిక్కవోలు: స్థానికంగా కొలువైన లక్ష్మీ గణపతి ఆలయం, గోలింగేశ్వరస్వామి ఆలయాలను పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి పరమపూజ శ్రీప్రజ్ఞానంద సరస్వతి (బాలస్వామీజీ) సందర్శించారు. బుధవారం బిక్కవోలుకు చెందిన ఆర్యవైశ్యుల విజ్ఞప్తి మేరకు ఆయన వచ్చారు. తొలుత ఆయనకు ఆర్య వైశ్యులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో దిగవల్లి వెంకటేశ్వరరావు, శ్రీరామ్మూర్తి, కుసుమంచి వెంకటేశ్వర్లు, శివన్నారాయణ, నాగులకొండ సూర్యప్రకాష్, బొండాడ బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి


వీరభద్రరావు మృతదేహం

తుని: స్థానిక జాతీయ రహదారి కొండవారిపేట ప్రాంతంలో ఉన్న చర్చి ఎదురుగా ఉన్న పొదల్లో వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్టు తుని పట్టణ సీఐ గీతా రామకృష్ణ తెలిపారు. బుధవారం అందిన సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకుని ఆయన తెలిపిన వివరాల మేరకు పిఠాపురం రూరల్ మండలం కోలంక గ్రామానికి చెందిన నంద్యాల వీరభద్రరావు (40)గా మృతుడిని గుర్తించారు. ప్రస్తుతం వీరభద్రరావు కుటుంబ సభ్యులను విచారిస్తున్నామన్నారు. ప్రమాదమా, లేదా హత్యా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. ప్రత్యేక బృందంతో దర్యాప్తు చేస్తున్నామని, అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామన్నారు.

ఏడీబీ రోడ్డుపై లారీ దగ్ధం


రంగంపేట వద్ద ఏడీబీ రోడ్డుపై దగ్ధం అవుతున్న కాంక్రీట్ మిల్లర్ లారీ

రంగంపేట: స్థానిక శివారు ఏడీబీ రోడ్డుపై బుధవారం కాంక్రీట్ మిల్లర్ లారీ దగ్ధమైంది. ఏడీబీ రోడ్డు అభివృద్ధి పనుల్లో భాగంగా కాంక్రీట్ తీసుకువచ్చిన లారీ అన్‌లోడింగ్ అనంతరం డ్రైవర్ లారీని రోడ్డుపై పార్కు చేసి పక్కకు వెళ్లారు. అనంతరం లారీపై ఉన్న విద్యుత్తు తీగలు గాలికి కదిలి తాకడంతో ఒక్కసారిగా లారీ టైర్ల నుంచి మంటలు వచ్చి పూర్తిగా దగ్ధమైంది. ప్రమాద సమయంలో లారీలో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. దీనిపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.